# దేవుడు మరియను ఎందుకు ఎన్నుకున్నాడు

### లూకా 1, 2ల పరిశీలన

గుణవతియైన స్త్రీని గూర్చిన లేఖన భాగంలో, "ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు" అని గుర్తింపబడింది (సామెతలు 31:28ఎ). ఆ మాటను కె.జె.వి ఈ విధంగా తెలుపుతుంది: "ఆమె పిల్లలు లేచి, ఆమె అనుగ్రహము పొందినదని అందురు."

తల్లులు ప్రత్యేకమైనవారు. "ప్రతివారికి తమ్మును ప్రేమించే, విశ్వసించే, చింతించే, బలపరచే, ఆదరించే, తమతో కలిసి నవ్వే, ఏడ్చేవారు అవసరమై యుంటారు" అని చార్లీ బ్రౌన్ అన్నాడు. "అది చాలమంది" అని లూసీ అన్నది. "లేక ఒక అద్భుతమైన తల్లి" అని స్నూపే అన్నాడు.[1] నాయందు నమ్మికయుంచి నన్ను బలపరచినవారి జాబితాలో మొట్టమొదట యిద్దరు తల్లులున్నారు: నా సొంత తల్లి మరియు నా ముగ్గురు బాలికల తల్లి. మనలో ఎక్కువమంది లేచి మన తల్లులను ధన్యురాళ్లని అంటాం.

లూకా 1లో, మరియొకరి తల్లిని ధన్యురాలని పిలిచేలా మనం ప్రోత్సహింపబడ్డాం. 42వ వచనంలో, కాబోయే ఒక తల్లిని, "స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడినదానవు" అని ఎలీసబెతు అంది. "స్త్రీలలో నీవు అత్యధికంగా ఆశీర్వదింపబడినదానవని" దాని భావం. 48వ వచనంలో ఆ స్త్రీ స్పందించుచూ, "ఇది మొదలుకొని అన్ని తరములవారును నన్ను ధన్యురాలని యందురు" అని ప్రత్యుత్తర మిచ్చింది. తన పిల్లలను ఆమెను ధన్యురాలని అనడం మాత్రమేగాక, ఆమె దేవునిచే ఆశీర్వాదింపబడినట్టు ప్రజలందరు ఆమెను గుర్తిస్తారు. ఈ లేఖన భాగం ప్రభువైన యేసు తల్లియైన మరియను గూర్చి మాట్లాడుతుంది.

తల్లులందరు దీవించబడినవారే, అయితే మరియ ప్రత్యేకంగా దీవించబడింది. ఆ కాలం జన్మించిన యూదా స్త్రీలందరిలో, తన కుమారునికి తల్లిగా ఉండునట్లు దేవుడు మరియను కోరుకున్నాడు. ఈ వాస్తవాన్ని మనం ఆలోచించేటప్పుడు, "ఎందుకు? మరియలో ఉన్న ప్రత్యేకత ఏమి?" అని మనం అడుగుతాం.

ఆమెనే కోరుకొనవలసినదిగా దేవునికి ఎలాంటి నిర్బంధం లేదు. మరియ ఎంతో మంచిదియు పరిపూర్ణురాలైనందున దేవుడు ఆమెను కోరుకొన వలసివచ్చిందని లేఖనాలు చెప్పలేదు. తన కృపను తెలిపేటందుకు దేవుడు ఆమెను కోరుకున్నాడు. దూత మరియను ఈ మాటలతో పలుకరించాడు: "దయా ప్రాప్తురాలా నీకు శుభము" (లూకా 1:28). "దయా ప్రాప్తురాలా" అనేది కృపపొందిన దానా అనే భావంతో చెప్పబడింది. "కృప"

అనేది "నిష్కారణపు ప్రేమ" – నిర్హేతుకమైన దయను సూచిస్తుంది. ఆయినప్పటికిని, దేవునిచే ఏర్పరచుకొనబడడానికి, మరియకు కొన్ని విశేష లక్షణాలున్నాయి. అందువలన, "ఆ గుణలక్షణాలేవి?" అని మరల అడుగుతాం. ఈ పాఠంలో, "దేవుడు ఎందుకు మరియను కోరుకున్నాడో" కనుగొనడానికిగాను ఆమె జీవితాన్ని పరిశీలించుదాం.

తొలిగా లుకా 1:26కు తిప్పిచూడు. "ఆరవ నెలలో ..." అని ఆ వచనం ప్రారంభించబడుతుంది. స్నానికుడైన యోహాను తల్లియైన ఎలీసబెతు గర్భవతియైన ఆరవనెల యిది. "ఆరవ నెలలో గబ్రియేలను దేవదూత గలిలయలోని నజరేతను ఊరికి ..." పంపబడెను. నజరేతు గలిలయ సముద్రానికి పశ్చిమ దిశగా 15 మైళ్ల దూరంలో ఉంది. మధ్య దరా సముద్రం నుండి 22 మైళ్ల దూరంలో ఉంది; లెబనాను పర్వతశ్రేణికి దక్షణదిశ ఏటవాలు చివరి భాగంలో ఉంది.

"దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడిన కన్యకయొద్దకు దేవునిచేత పంపబడెను" (1:27ఎ). యోసేపు దావీదు సంతతివాడు. అయితే రాజవంశం క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుని పోయింది. యోసేపు ఒక పేద[2] వడ్రంగిగా (మత్తయి 13:55) నజరేతులో నిలిచిపోయాడు (లూకా 2:4).

దేవదూత పంపబడింది కన్యయైన మరియ యొద్దకు (1:27బి). "మిర్యాము"[3] అనే హెబ్రీ పేరుకు గ్రీకు రూపము "మరియ" అనేది. యోసేపువలె మరియ కూడా రాజైన దావీదు[4] వంశం నుండి ఉన్నతమైన కుటుంబం నుండి వచ్చిందే.[5] మరియ యోసేపుకు ప్రధానం చేయబడింది (మత్తయి 1:18). గనుక, గబ్రియేలు దూత ఆమెను దర్శించినప్పుడు మరియ యౌవనవతియై ఉండవచ్చు.[6]

దేవుని ఉద్దేశాలు నెరవేర్చబడ వచ్చినప్పుడు, పరిసరాలు పరిస్థితులు అంత ప్రాముఖ్యమైనవిగా ఉండవు. దేవుడు ఎవరినైనా ఏ చోటనైనా వినియోగించు కోగలడు. దేవునిచే ఉపయోగించుకొన బడడానికి నీవు వృద్ధుడవు అయ్యేవరకు దేహం ముడతలు పడేవరకు వేచియుండనవసరం లేదని ఈ లేఖన భాగంలో సూచింపబడింది. దేవదూత, దేవుని సంకల్పం నెరవేరడానికి ఒక బాలిక – యౌవనంలో ఉన్న కన్య సహాయం తీసుకోవాలని పట్టికలో వేశాడు.

## తన బుద్ధిని ఉపయోగించుకొనడానికి ఆమె భయపడలేదు

"ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి–దయాప్రాప్తురాలా నీకు శుభము; ప్రభువు నీకు తోడై యున్నాడని చెప్పెను" (1:28). ఆ మాటకు మరియ గాబరా పడింది (1:29ఎ). పరలోకపు సందర్శకుని ఎదుర్కొని నప్పుడు, బైబిల్లోని ఎక్కువమంది ప్రజలు తత్తరపాటు పడ్డారు. భయపడకుండా, ఆమె – "ఈ శుభ వచనమేమిటోయని" ఆలోచింపసాగింది (1:29బి).

మరియ తన బుర్రను ఉపయోగించింది. యేసు జననానికి సంబంధించిన సంగతులను ఆమె తలపోసికొనుచు భద్రం చేసికొనుచున్నట్టు తరువాత సూచింపబడింది (లూకా 2:19). దేవుడు తనకు ప్రసాదించిన తెలివిని ఉపయోగించుకొనడానికి ఆమె భయపడలేదు.

## ఆమె దైవభక్తిగల యువతి

"మరియా భయపడకుము, దేవుని వలన నీవు కృపపొందితివి" అని దూత అన్నాడు (1:30). ప్రాథమికమైన మంచితనం లేకుండ, ఎవరును దేవుని కృపను పొందరు. నిష్కపటమైన, భక్తిగల, నీతి ప్రమాణాలతో జీవించే – నమ్మదగిన వ్యక్తిగా మరియను మనం ఆలోచించవచ్చు.

## దేవునియందు - ఆయన శక్తియందు
## ఆమె నమ్మిక ఉంచింది

ఆ దూత యింకను యిలా అన్నాడు:

> ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; **ప్రభువైన** దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును, ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదైయుండును (లూకా 1:31–33).

యేసు రాజ్యము సంఘమే (మత్తయి16:18,19). ఆయన ఆరోహణుడై దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడినప్పుడు, దావీదు సింహాసనముపై ప్రభువు ఆసీనుడై యున్నాడు (అపొ. 2:25–36). దూత పలుకులలో యివన్నీ యిమిడియున్నాయి.

భవిష్యత్తులో యింకా ముప్ఫై సంవత్సరాలు దాటిన తరువాత ఏమి జరుగబోతుందనే సంగతి యువతియైన మరియకు పట్టినట్టులేదు. "నీవు గర్భము ధరించి కుమారుని కని ..." అనే పలుకులే తన చెవులలో గింగురుమంటున్నాయి. "–నేను పురుషుని ఎరుగని దాననే; యిదేలాగు జరుగును?" అనేదే దూత ఎదుట ఆమె పెట్టిన ప్రశ్న (1:34).

మనకు మొదట, ఈ సంగతి జెకర్యా నమ్మలేక ప్రతిస్పందించి తొమ్మిది మాసాలు మాటలాడలేక ఉండిపోయిన విషయంలో కనిపిస్తుంది (1:18, 20). అయితే అది జరుగుతుందా లేదా అనేది మరియ ప్రశ్న కాదు, కాని యిది ఎలా జరుగుతుంది? అనేది ఆమె ప్రశ్న. ఆమె దూత మాటలను నమ్మింది అని యిక్కడ నొక్కి చెప్పబడింది (1:45).

"ఏలాగు" అనే ఆమె ప్రశ్నకు, దూత యిలా జవాబిచ్చాడు: "పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (1:35). "కమ్ముకొనును" అనే పదం దేవుని ప్రసన్నతతో ప్రత్యక్షగుడారం నింపబడును అనే భావంతో సెప్టూజంటులో[7] తర్జుమా చేయబడింది (నిర్గమ. 40:35 చూడు).[8]

మరియ సూచన కొరకు అడుగలేదు. అయితే దేవదూత తానే స్వయంగా ఆమెకు యిలా సూచన నిచ్చాడు: "నీ బంధువురాలు[9] ఎలీసబెతుకూడ వృద్ధాప్యమందు ఒక కుమారుని గర్భము ధరించియున్నది; గొడ్రాలనబడిన ఆమెకు ఇది ఆరవ మాసము" (1:36). ఇంకను అతడిలా అన్నాడు: "దేవుడు చెప్పిన ఏ మాటయు నిరర్థకము కానేరదు"[10] (1:37). దీన్ని

నమ్మవలసిందిగా మరియ కోరబడింది – ఆమె దాన్ని నమ్మింది (1:45). జీవితంలో సవ్వాళ్లను ఎదుర్కొనే సమయంలో మనం కూడా ఆలాగే నమ్మవలసి యుంటుంది.

## ఆమెకు వినయ స్వభావముంది

"అందుకు మరియ– ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాట చొప్పున జరుగునుగాక అనెను" (1:38ఎ). దేవుడు మరియను ఎందుకు ఏర్పరచుకున్నాడో చెప్పే ఒకే వచనం ఉంటే, అది యిదే. "ప్రభువు దాసురాలను" అనే ప్రయోగాన్ని మొదటిగా గుర్తించు. "దాసురాలను" అనే పదం "బానిసను" అనే గ్రీకుపదం నుండి వచ్చింది. బానిసల్లో స్త్రీలు బహుగా తృణీకరింపబడి, అమర్యాదకు గురిచేయబడతారు. "నా ఆత్మ నా రక్షకుడైన దేవునియందు ఆనందించెను" అని మరియ పాడుతుంది (1:48).

## ఆమె దేవుని చిత్తానికి లోబడుతుంది

1:38లో రెండవ భాగాన్ని గమనించు: "నీ మాట చొప్పున నాకు జరుగునుగాక అనెను." అందులో సూచించినదాన్ని గమనించు (మరియ ఆలోచించే వ్యక్తి, ఆమె కనులు తెరచి అందులో ప్రవేశించింది). ఆమె యొక యువతి, వివాహం కొరకు ప్రధానం చేయబడిన కన్య. అయితే తటాలున ఆమె గర్భవతికానున్నది. కాబోయే భర్త "నా వలన కలిగింది కాదు" అని ఆక్షేపించబోతాడు!

నజరేతువంటి ఒక చిన్న బస్తీలో ఆమె పరిస్థితి ఎంత ఘోరంగా ఉండబోతుందో అర్థం చేసికో. తనపైపడే చూపులు, మాటలు, వికటమైన పలుకులు, గుసగుసలు, వగైరాల వంటివి ఊహించి చూడు.[11] ఆమె తన ప్రాణాన్ని సహితం కోల్పోవచ్చు – ఎందుకంటే ప్రధానం చేయబడిన కన్య వ్యభిచరించితే ఆమెను రాళ్లతో చావగొట్టతారు. (ద్వితీయో. 22: 23, 24[12]). పాత నిబంధనలో, మరణశిక్ష విధింపబడే పాపముల న్నిటిలో, జారత్వమనేది క్షమించరానిది. ఆమెకు విరోధంగా యిద్దరు ముగ్గురు సాక్షులను (ద్వితీయో. 17:6; 19:15) కనుగొనడానికి ఎటువంటి సమస్యలేదు; మరియకు ఆరు మాసాలు నిండిన తరువాత ఆమె గర్భం రుజువౌతుంది.

మరియకు గర్భాన్ని ధరించడంలో ఉండే సాధక బాధకులన్నీ తెలుసు. అయినా, "నీ మాట చొప్పున జరుగును గాక" అని మరియ అంది. అంటే, "ఆ విధంగా కావాలని దేవుడు కోరుకుంటే, అది ఆలాగే జరుగుతుంది." దేవుని చిత్తానికి ఆమె తన్ను లోబరచుకుంది. అలాటి వ్యక్తిని – తండ్రో, తల్లో, కుమారుడో, కుమార్తెయో – దేవుడు ఉపయోగించుకొనగలడు.

"దూత ఆమె యొద్దనుండి వెళ్లిన" తరువాత, (1:38బి), "ఆమె బంధువైన ఎలీసబెతును చూచుటకు మరియ లేచి యూదా ప్రదేశములోని కొండసీమలోనున్న ఒక ఊరికి త్వరగా" వెళ్లింది (1:39). తనకు ఏమి సంభవించిందో నమ్మగలిగే కొద్దిమందిలో ఎలీసబెతు ఒకతె.

ఎలీసబెతు మరియను చూచినప్పుడు, ఆమె పరిశుద్ధాత్మతో నిండుకొనినదై (1:41బి),

బిగ్గరగా యిలా అంది (1:42ఎ): "స్త్రీలలో నీవు ఆశీర్వదింపబడినదానవు నీ గర్భఫలమును ఆశీర్వదింపబడును. నా ప్రభువు తల్లి నా యొద్దకు వచ్చుట నాకేలాగు ప్రాప్తించెను?" (1:42, 43).

## ఆమె లేఖనముల నెరిగినది

46వ వచనంతో ఆరంభమై 55వ వచనం వరకు కొనసాగే గంభీరమైన స్తుతిగీతముతో మరియ ప్రత్యుత్తరమిచ్చింది. "క్రొత్త నిబంధన అంతటిలో యిది సాహిత్య ముత్యమై" యున్నట్లు ఎర్నెస్ట్ హసర్ ఈ భాగాన్ని వర్ణించాడు[13] ఈ ఏడు వచనాలలో, ప్రభువైన యేసు తల్లి మాటలు దాఖలు చేయబడ్డాయి.

1 సమూయేలు 2:1–10లోని హన్నా కీర్తనను మరియ పలుకులు జ్ఞప్తి చేస్తున్నాయి. మరియ గీతంలో మూడు తలంపులున్నాయి: (1) దేవుడు తనకు ఏమి చేసింది (1:46–49), (2) మనుష్యులందరికి ఆయన ఏమిచేసింది – ఆయన నిస్సహాయులకు, దీనులకు, ఆకలిగొన్నవారికి ఆయన చేసింది (1:50–53) మరియు (3) ఇశ్రాయేలుకు దేవుడు ఏమి చేసింది (1:54, 55). దేవుడు తమ మాటను ఎల్లవేళలా నిలబెట్టుకుంటాడనే దానికి చివరిది రుజువుగా ఉంది!

మరియ చెప్పిన దానిని మనం ఆలోచిస్తే, ఆమె లేఖనాలు ఎరిగినదైయున్నట్లు మనం ఒప్పింపబడతాం.[14] ఆ స్తుతి పలుకులలో పాత నిబంధనలోని పన్నెండు లేఖన భాగాలు కన్పిస్తాయి. బాలురు మాత్రమే సమాజమందిరపు పాఠశాలకు అనుమతింపబడే దినాల్లో ఆమె యింత ఎరిగి యుండడమనేది ఘనమైనదే.

మరియ జీవితాన్ని మనం త్వరగా ఆకళింపు చేసుకోవాలి. లూకా 2లో ప్రభువు జన్మించడం గొర్రెల కాపరులు సందర్శించడం తెలుపబడింది. "అయితే మరియ ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు భద్రము చేసికొనెను" అని 19వ వచనం అంటుంది.

## ఆమె ధైర్యముగలది

యేసు జన్మకు నలభైదినాలు తరువాత, బలిని అర్పించడానికి మరియ, యోసేపులు బాలుడైన యేసును యెరూషలేమునకు తీసికొని వస్తారు (లేవీ. 12:2–4, 6–8). అక్కడ సుమెయోను అను పేరుగలవాడు ఆ శిశువును తన చేతులలోనికి తీసికొని, ఆయన జరిగించబోవు కార్యములను గూర్చి పలికాడు (లూకా 2:25–35). అతని మాటల్లో కీడును ముందుగా తెలుపుతూ, "నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొనిపోవునని ఆయన తల్లియైన మరియతో ..." చెప్పాడు (2:35).

ఇక్కడ ఆగి, మరియ కొరకు వేచియున్న పనిని గూర్చి ఆలోచించు. ముగ్గురు కుమార్తెలను పెంచడం నాకు నా భార్యకు అంత సులభమేమీ కాదు. మరియకు కనీసం ఏడుగురు పిల్లలున్నారు,[15] వారిలో పెద్దవాడు దేవుని కుమారుడు! దేవుని సొంత కుమారుని పెంచడంలో ఉండే ఒత్తిడిని నేను ఊహించలేను. ఇప్పుడు, దానికి పైన, తన హృదయంలోనుండి ఒక

ఖడ్గం దూసికొని పోతుందని సుమెయోను అంటాడు. హృదయ వేదన ముందుంది!

కేవలం ధైర్యంగల స్త్రీ మాత్రమే – దాని ఎదుర్కొని – ఆ పరిస్థితులలో నిలువగలుగుతుంది. వివాహం కాకముందే తల్లి అయ్యే విషయం అసలు విననవకాశంలేని దినాల్లో – దాని పర్యవసానాలన్నిటిని భరించడానికి మరియ ధైర్యం వహించింది. ప్రభువు తల్లిగా పర్యవసానం అనుభవించడానికి మరియ ధైర్యం వహించింది.

రాజాస్థానంలో అతి గారాభంగా చూడబడే ముద్దుబిడ్డకు బదులుగా, స్త్రీలలో గుర్తింపులేని ఎవరికి తెలియని గ్రామ కాపురస్థురాలైన పేదరాలిని దేవుడు ఎందుకు ఏర్పరచుకున్నాడో ఈ సత్యం వివరింపవచ్చు. దృఢంగా ఉండగలిగిన వారొకరు దేవునికి అవసరం. "దృఢంగా ఉండే ఒకరు దేవునికి కావాలి."[16]

ప్రభువు చేసిన వ్యక్తిగత పరిచర్య కాలంలో మనం యోసేపును గూర్చి ఎక్కడా చూడలేము; మరియ, ఆమె పిల్లలను గూర్చి మాత్రమే చదువుతాం. దీన్ని బట్టి, యోసేపు మరియకంటె బాగా పెద్దవాడై ప్రభువు పరిచర్య ఆరంభించకముందే చనిపోయి ఉండవచ్చునని అనేకులు భావిస్తారు.[17] మరియ ఒంటరిగా ఆ ఏడుగురు పిల్లలను పెంచే భారం వహించింది.[18] అది అంత సులభమయ్యిందికాదని మీలో కొందరికి తెలిసియుండవచ్చు. దృఢంగా ఉండే ఒకరు దేవునికి కావాలని మరల అంటున్నా!

## బాధ్యత వహించడానికి ఆమె యిష్టపడింది

మరియ దృఢత్వంతోపాటు బాధ్యతను వహించే నేర్పుకూడా బంధించబడింది. ఈ గుణం అనేక మందిలో కనబడదు. పన్నెండేండ్ల ప్రాయంలోని ప్రభువు జీవిత సంఘటన దీనికి ఉదాహరణగా ఉపయోగింపవచ్చు (లూకా 2:41-51). యేసు ఎక్కడ ఉన్నది యోసేపు మరియలు కనుగొనలేనప్పుడు, యెరూషలేములో ఆయన కొరకు శ్రద్ధగా వెదకారు. ఆయన విషయమై అక్కర కలిగియుండే బాధ్యతను దేవుడు వారికప్పగించాడు గదా! విచారకరంగా, బాధ్యతను అంగీకరించడానికి నేడు కొందరు యిష్టపడడం లేదు – వ్యక్తిగతమైన జీవితాల్లోను, వారి వివాహల్లోను, వారి కుటుంబాల్లోను బాధ్యతారహితంగా ఉంటున్నారు.

## తన కుమారుని యందు నమ్మకాన్ని ఆమె వ్యక్తపరచింది

పద్దెనిమిది సంవత్సరాలను దాటి, ప్రభువైన యేసు బహిరంగ పరిచర్యకు వచ్చాం. ఆ పరిచర్య ఆరంభంలో, మరియయు ఆమె కుమారుడును కానాలోని ఒక వివాహమందున్నారు. విందులో ద్రాక్షారసం అయిపోగా, – "వారికి ద్రాక్షారసము లేదని" మరియ ప్రభువుతో చెప్పింది (యెహాను 2:3).[19] మరియ "పరిచారకులను చూచి – ఆయన మీతో చెప్పునది చేయుడనెను" (యోహాను 2:5). ఆ పరిస్థితిని తన కుమారుడు చక్కదిద్దగలడని ఆమె నమ్మింది.

ప్రతి తల్లితండ్రులకు ఉండవలసిన లక్షణాన్ని ఆమె ప్రదర్శించింది. ఆమె తన బిడ్డపై నమ్మికయుంచింది, ఆ నమ్మికను వ్యక్తపరచింది. "నీవు దాన్ని చేయగలవు" అంటూ, నా తల్లి నా పై ఎడబాయని నమ్మికను కనపరచింది – ఆమె నాకు యిచ్చిన బహుమానాల్లో అతి గొప్పది.

## ఇతరుల క్షేమమును గూర్చి ఆమె అక్కర కలిగియుంది

తక్కిన మూడుకుపైగా ఉన్న సంవత్సర కాలంలో, భోజనం సరిగా ప్రభువునకు కుదరడం లేదని కొన్ని సార్లు మరియ అక్కర చూపినట్టు కన్పిస్తుంది (మార్కు 3:20, 21). ఆమెయు, ఆమె యితర పిల్లలును ఆయనను యింటికి తోడుకొనిరావాలని కోరారు (మార్కు 3:31–35).[20] ఆ పరిస్థితి మరియకు ఆమె కుటుంబానికి సాధ్యం కాలేదు. ప్రభువు నిజంగా ఎవరో, ఆయన పని ఏమో, అప్పటికి వారికి పూర్తిగా తెలియదు. అయినప్పటికి, మరియ తన కుమారునియందు అక్కర కనుపరచినట్టు ఆ సంఘటన సూచిస్తుంది. నీ తల్లి నీయెడల అక్కర కనుపరచినట్టయితే, ఆలాటి తల్లి నిమిత్తం నీవు దేవునికి కృతజ్ఞత చెల్లించువాడవైయుంటావు.

## తన పనిలో కడవరకు ఆమె నమ్మకంగా ఉంది

సిలువ వరకు – గల మధ్యకాలంలో యిప్పటినుండి రచనలో మరియ కన్పించదు. బాధించెడి ఈ దృశ్యాన్ని యోహాను రికార్డు చేస్తున్నాడు:

> ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు యేసు సిలువయొద్ద నిలుచుండిరి. యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి – అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను, తరువాత శిష్యుని చూచి – యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియ నుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను (యోహాను 19:25–27).

మరియ అక్కడ నిలిచి సిలువపైనున్న తన కుమారుని తిలకించడాన్ని నీవు చూడగలవా? తన చెక్కిళ్ళపై కన్నీరు ధారలై కారడం నీవు చూడగలవా? అతని చిన్న రూపాన్ని తన చేతుల్లో ఉంచి ఊపడాన్ని నీవు ఊహించగలవా? సంవత్సరాల క్రిందట ఈ చిత్రాన్ని వర్ణించిన పద్యాన్ని నేను కంఠస్థం చేశాను:

> ఇద్దరు స్త్రీలు విలపించగా నేను విన్నాను
> కొండ దిగువకు వారు వచ్చారు;
> ఒకటి తునిగిపోయినా గులాబిలా ఉంది,
> రెండవది అగ్ని జ్వాలలా ఉంది.
> "వారి దుష్ట కరములు జరిగించిన ఈ కార్యముకై
> మనుష్యులు విలపించుదురు" అని ఒకరన్నారు.

మరొకరు తన కన్నీటి ధారల ద్వారా అన్నారు;
"నా కుమారుడా, నా కుమారుడా, నా కుమారుడా" అని.[21]

గొల్గొతా అనే కొండమీద, సంవత్సరాల క్రిందట పలుకబడిన మాటలను మరియ కడకు గుర్తు చేసికొంటుంది: "నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొనిపోవును" – అనేవి సజీవంగా తన కన్నుల యెదుట ప్రత్యక్షమయ్యాయి (లూకా 2:35ఎ). విసుగు చెందేలా వినిపించినా, దేవునికి దృఢమైనవారు కావాలని మరల అంటున్నా.

ఒక చివరి దృశ్యం మిగిలిపోయింది: ప్రభువైన యేసు మరణము, సమాధి, పునరుత్థానాల తరువాత, పరిశుద్ధాత్మ రాకకును, సంఘ రాజ్యం ప్రారంభమవ్వడానికి శిష్యులు యెరూషలేములో వేచియున్నారు. అక్కడ ఆ శిష్యులతో యేసు తల్లియైన మరియ వారితో ఉన్నట్టు లూకా దాఖలు చేశాడు (అపొ. 1:14). ఆయన సహోదరులు విశ్వాసం లోనికి వచ్చారు. మరియ విశ్వాసం గ్రహింపుతో వికసించింది.

అక్కడ మరియను మనం వదలిపెట్టాలి. దైవప్రేరేపితం కాని ఒక పరంపర ఆమె యెరూషలేములో మృతిచెందినట్టును, మరొకటి యోహానుతో ఆమె ఎఫెసునకు వెళ్లి అక్కడే ఆమె మృతినొందినట్టు తెలుపుతాయి. ఆరంభ సంఘంలో ఆమె భాగం వహించినట్టు దేవుడు మనకు తెలిపాడు. దానితో ప్రభువు తల్లి కథను గూర్చిన తెరను ఆయన దించాడు.

## ముగింపు

దేవుడు మరియను ఎందుకు ఏర్పరచుకున్నాడు? దాదాపుగా అసాధ్యంలా తోచే పనిని దేవుడు మరియకు ఎందుకు అప్పగించాడో సూచించే కొన్ని గుణలక్షణాలను చూచాం. ఆ ప్రధానాంశాలను మరోసారి చూద్దాం:

- తన బుద్ధిని ఉపయోగించుకొన ఆమె భయపడలేదు.
- ఆమె దైవభక్తిగల యువతి.
- దేవునియందు, ఆయన శక్తియందు ఆమె నమ్మిక ఉంచింది.
- ఆమెకు వినయ స్వభావముంది.
- ఆమె దేవుని చిత్తానికి లోబడుతుంది.
- ఆమె లేఖనముల నెరిగినది.
- ఆమె ధైర్యము గలది.
- బాధ్యత వహించడానికి ఆమె యిష్టపడింది.
- తన కుమారునియందు నమ్మకాన్ని ఆమె వ్యక్తపరచింది.
- ఇతరుల క్షేమాన్ని గూర్చి ఆమె అక్కర కలిగియుంది.
- తన పనిలో కడవరకు ఆమె నమ్మకంగా ఉంది.

జీవిత కార్యకలాపాల్లో విజయవంతంగా ఉండడానికి ఈలాటి గుణలక్షణాలు ఎవరికైనా సహాయపడతాయి. తన పరిచర్యలో దేవునిచే వినియోగించబడడానికి ఎవనికైనా యోగ్యతను కలిగిస్తాయి.

మనం ముగించడానికి ముందు, “ఆమె దేవుని చిత్తానికి లోబడుతుంది” అనే మరియ యొక్క ప్రత్యేకమైన గుణలక్షణం వద్దకు తిరిగి వద్దాం. దూతతో ఆమె పలికిన మాటలను మరోసారి ఆలోచించు: “నీ మాటచొప్పున నాకు జరుగునుగాక” (లూకా 1:38బి). మరియ ప్రత్యుత్తరం మీద కెన్ గైర్ యిలా వ్యాఖ్యానించాడు:

> … ఆమె తీర్మాణం త్వరగా చేసింది, ఆమె విధేయత సంపూర్ణమయ్యింది. ఆమె దేవునికి లోబరచుకొంటుంది, అది రేకెత్తించే ప్రశ్నలు ఎలాటివైనా సరే, లేక … దాని పర్యవసానమేమైనా కాని, లేక ఫలితాలేవైనా కాని, తన మర్యాద మంటలో కలిసి పోయినాగాని, లేక ఆమె ప్రేమించిన పురుషుడు ఏమనుకున్నాగాని
> కడకు తన ప్రాణమే పోయినాగాని.
>
> … ఈ యువతికి గల ఉత్తమ గుణగణాలన్నిటిలో, “ఏమైనా సరే” అనే ఈ లక్షణమే [యేసు]ను పెంచడానికి ఆమెను తగినట్టు చేసియుండవచ్చు …[22]

దాని వెల ఎంతైనా, దాని ఫలితాలేవైనా, నీ ప్రభువునకు[23] లోబడడానికి నీవు యిష్ట పడుతున్నావా? అయినట్టయితే, తన పనిలో దేవుడు ఉపయోగించుకొనడానికి నీవు కూడా తగిన వ్యక్తివై యుంటావు.

---

సూచనలు

[1]Snoopy is Charlie Brown’s dog. In comic strips, cartoon animals sometimes express thoughts in words. [2]వారు అర్పించిన బలులను బట్టి యోసేపు మరియలు పేదలన్న సంగతి మనకు అర్థమౌతుంది. (లూకా 2:24ను లేవీ. 12:6–8తో పోల్చిచూడు). వారికి స్తోమత ఉండియున్నట్టయితే, బిడ్డ గొప్పతనం ఎరిగిన తరువాత యోసేపు మరియలు తక్కువైన బలులు ఎన్నడే అర్పించేవారు కాదు. మామూలైనవి మరి ఖరీదైనవి అర్పించియుండేవారేనని మెగార్వే సరిగా చెప్పాడు. (J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* [Cincinnati: Standard Publishing Co., 1914] 34). యేసు జీవిత విధానం (మత్తయి 8:20) కూడా తక్కువైన ఆరంభాన్నే సూచిస్తుంది. [3]“మిర్యాము” అంటే చేదు. రూతు 1:20 ఆ పదం యొక్క రూపాన్ని ఉపయోగిస్తుంది. పాత నిబంధనలో (మోషే అక్కయైన) ఒక మిర్యామే ఉందికాని, క్రొత్త నిబంధనలో అనేక మంది మరియలు ఉన్నారు. [4]క్రీస్తు దావీదు సంతతివాడని మన లేఖన భాగం నొక్కి పలుకుతుంది. తన నుండి మెస్సీయా వస్తాడని దేవుడు దావీదుకు తెలిపాడు ( 2 సమూయేలు 7:12). “[దావీదు] గర్భవాసం నుండి మెస్సీయా వచ్చునని” అక్షరార్థంగా దేవుడు (1:32, 69) తెలిపాడు. యోసేపు ద్వారా యేసు దావీదు యొక్క శరీరసంబంధమైన సంతతి కానందున, మరియ ద్వారా ఆ వాగ్దానం నెరవేర్చబడింది. [5]రెండవ సూచనను రివ్యూ చేయుము. [6]తరచుగా యువతెలు నవయవ్వనులై యుంటారు. యోసేపు కొంచెం ఎక్కువ వయస్సు గలవాడైయుండవచ్చు. యోసేపు ప్రభువు యొక్క పరిచర్య కాలంలో కన్పించడు. యేసుకు 30 ఏండ్లు రాకముందే యోసేపు చనిపోయి ఉండవచ్చునని చెప్పబడింది. [7]పాత నిబంధనకు సెప్టూజంట్ గ్రీకు తర్జుమా. దానిని గూర్చిన వివరణను చూడు. [8]యేసు కన్య గర్భమందు జన్మించడానికి గ్రీకు పురాణాలకును సంబంధ–సమాంతర చూప ప్రయత్నాలు జరిగాయి. దేవదూత యొక్క సున్నితమైన పలుకులకును గ్రీకు దేవత కథలకును పోలికలే లేవు. [9]“బంధువురాలు” అంటే–మరియ ఎలీసబెతులు ఎంత దగ్గర బంధువులో ఆ బంధుత్వం ఎలాటిదో మనకు తెలియదు. [10]“ఎట్లనగా, “దేవునికి ఏ మాటయు అసాధ్యం కాదు. “దేవుని” మాటలలో ఏదియు శక్తిలేనట్టు వ్యర్థం కాదు” అని ASV అంటుంది.

[11]యోహాను 8:41 “మేము వ్యభిచారము వలన పుట్టినవారము కాము–కాని నీవు అలా పుట్టిన వాడవని” కొందరు

తలంచుతారు. [12]లేవీ. 20:10; యెహెజ్కేలు 16:38; యోహాను 8:5లను కూడా చూడు. [13]Ernest O. Hauser, " Mary, Mother of Christ," *Reader's Digest* (December 1971): 170. [14]ఎలీసబెతువలె జెకర్యా కూడా తరువాత "పరిశుద్ధాత్మ పూర్ణుడైనట్టి మరియ కూడా పరిశుద్ధాత్మతో నిండు కునే" అవకాశాన్ని నేను తగ్గించను (1:41, 67). కాని, మరియ పలుకులు వాక్యాన్ని వ్యక్తిగతంగా ఎరిగిన దానినుండి వచ్చినవని నేను నమ్ముతాను. [15](యోసేపు వలన) మరియకు నలుగురు కుమారులు, కనీసం యిద్దరు కుమార్తెలు కలిగారు (మార్కు 6:3). కుమారులెందరో, కుమార్తెలు కూడా అందరే అయ్యున్నట్టయితే మొత్తం మీద ఆమెకు పదిమంది పిల్లలున్నట్టే. [16]నీవున్న చోటులో, –"బలము ప్రతిఘటన" అనే పదాలను ఉపయోగించు. [17]ప్రభువు తన తల్లి బాధ్యతను యోహానుకు అప్పగించాడంటే, (యోహాను 19:26, 27) యోసేపు తప్పక అప్పటికి లేదని సూచింపబడుతుంది. [18]వారి తండ్రి చనిపోగా, పెద్దవాడుగా ఉండిన యేసు తన వెనుకవారి బాధ్యతను కొంత వేసికొని యుంటాడనేది గ్రహింపవచ్చు. అయితే తల్లిగా మరియ యొక్క బాధ్యత భారం ఎక్కువైనదిగా ఉంటుందనేది నిస్సందేహం. [19]మరియ, యేసులను గూర్చి "ప్రతి దానికి ఒక తొలిసారి" అనే పాఠాన్ని చూడు. [20]31వ వచనానికి 20వ వచనానికి సంబంధమున్నట్టు నిశ్చయంగా చెప్పజాలం కాని అట్టి అవకాశం ఉండవచ్చు.

[21]రచయిత తెలియదు. [22]Ken Gire, *Moments with the Savior* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1998), 26-27. [23]నీవు దీన్ని ప్రసంగంగా ఉపయోగించినప్పుడు, నీ శ్రోతలు ఏమి చేయాలో వారికి చెప్పు. వారు యింకా క్రైస్తవులు కాకుంటే, రక్షణమార్గాన్ని తెలుపు (అపొ. 2:37, 38; 8:35–39; 22:16). వారు క్రైస్తవులే అయ్యుంటే నమ్మకస్థులుగా కొనసాగాలని చెప్పు (అపొ. 8:22; 1యోహాను 1:9; యాకోబు 5:16).